జయ జయహే తెలంగాణ!

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను వివిధ పార్టీల నాయకులు, ప్రభుత్వ శాఖల అధికారులు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాల వద్ద, వివిధ పార్టీలు, పలు సంస్థల ఆధ్వర్యంలో జాతీయ జెండాను ఎగురవేశారు. మిఠాయి పంపిణీ చేశారు. అనంతరం తెలంగాణ రాష్ట్ర సాధనలో ప్రాణాలు కోల్పోయిన అమరులకు ఘనంగా నివాళులర్పించారు. వక్తలు మాట్లాడుతూ... అమరుల త్యాగ ఫలితమే ఇప్పుడు మనం అనుభవిస్తున్న తెలంగాణ అన్నారు. ఎంతోమంది యువకులు తమ ప్రాణాలను త్యాగం చేశారని, సాధించుకున్న తెలంగాణను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసుకోవటమే లక్ష్యమని తెలిపారు. – సాక్షి నెట్‌వర్క్


పాల్వంచ: మున్సిపాలిటీ కార్యాలయంలో జెండాకు వందనం చేస్తున్న కమిషనర్ కె.సుజాత


సూపర్‌బజార్(కొత్తగూడెం): జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కూనంనేని


చుంచుపల్లి: జెండా ఆవిష్కరిస్తున్న కంచర్ల చంద్రశేఖర్ రావు, తదితరులు


ఇల్లెందు: జాతీయ జెండాకు వందనం చేస్తున్న ఎమ్మెల్యే కోరం కనకయ్య, నాయకులు


కొత్తగూడెంఅర్బన్: చాతకొండ బెటాలియన్‌లో...


సింగరేణి(కొత్తగూడెం): అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న సింగరేణి జీఎం షాలేంరాజు


ఇల్లెందురూరల్: అటవీశాఖ కార్యాలయంలో..


సూపర్‌బజార్(కొత్తగూడెం): వందనం చేస్తున్న ఎస్పీ రోహిత్‌రాజ్


సుజాతనగర్: తహసీల్దార్ కార్యాలయంలో...


జూలూరుపాడు: మండల పరిషత్ కార్యాలయంలో


కొత్తగూడెంఅర్బన్: శ్రీరామ పాఠశాలలో..


చుంచుపల్లి: కొత్తగూడెం ఆర్టీసీ డిపోలో..


పాల్వంచరూరల్: కొబ్బరికాయ కొడుతున్న తహసీల్దార్ ప్రసాద్


ఇల్లెందు: జెండా ఎగుర వేస్తున్న న్యాయమూర్తి కీర్తి చంద్రికారెడ్డి


పాల్వంచరూరల్: మీసేవ కేంద్రం వద్ద బీజేపీ ఆధ్వర్యంలో


జూలూరుపాడు: కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో

క్లుప్తంగా

నేటి నుంచి విగ్రహ ప్రతిష్ఠ పూజలు


లక్ష్మీగణపతి ఆలయం

సింగరేణి(కొత్తగూడెం): కార్మిక ప్రాంతమైన రామవరంలోని శ్రీలక్ష్మీగణపతి దేవాలయంలో ఈనెల 3 నుంచి 5వ తేదీ వరకు పార్వతీ సమేత రామలింగేశ్వర, పంచముఖ ఆంజనేయ, సుబ్రహ్మణ్యేశ్వర, నంది ప్రతిష్ఠా మహోత్సవం ఉంటుందని ఆలయ కమిటీ సభ్యులు సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం పూజా కార్యక్రమాలు ప్రారంభించనున్నట్లు తెలిపారు.

ముగిసిన అంకమ్మతల్లి జాతర


మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

సుజాతనగర్: రాఘవాపురం గ్రామంలో గత నెల 28 నుంచి ప్రారంభమైన అంకమ్మతల్లి జాతర అశేష భక్త జనసందోహం నడుమ సోమవారం ఘనంగా ముగిసింది. చివరిరోజు జిల్లా నలుమూలల నుంచి సుమారు 10 వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. జాతరలో ముఖ్యమైన ఘట్టాలు కొలబియ్యం, వీరతాడు, అనంత బండారం, వసంతోత్సవం, కోర్లబండి కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఆడపడుచులు, మహిళలు, యువతులు తల్లికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

వేలంపాట వాయిదా

పాల్వంచరూరల్: మండలంలోని జగన్నాథపురం, కేశవాపురం గ్రామాల మధ్య కొలువై ఉన్న పెద్దమ్మతల్లి) ఆలయానికి చెందిన వ్యాపార దుకాణాలు, రెండు ఏసీ ఫంక్షన్ హాల్స్, చీరలు, కొబ్బరి చిప్పలు, తలనీలాలు పోగు చేసుకునేందుకు సోమవారం నిర్వహించిన బహిరంగ వేలంపాటలో ఒక షాపు మినహా మిగిలిన అన్నింటికీ పోటీదారులు ఎవరూ రానందున్న వేలంపాటను వాయిదా వేసినట్లు ఈఓ రజనీకుమారి తెలిపారు. మళ్లీ వేలంపాట నిర్వహించే తేదీని త్వరలో ప్రకటిస్తామని పేర్కొన్నారు. పాలకమండలి చైర్మన్ బాలినేని నాగేశ్వరరావు, డైరెక్టర్లు పాల్గొన్నారు.

భూములు పంపిణీ చేసిన ఘనత సీపీఐదే


మాట్లాడుతున్న విశ్వనాథం

పాల్వంచరూరల్: వంద సంవత్సరాల ఘన చరిత్ర కలిగిన సీపీఐ తెలంగాణ సాయుధ, భూపోరాటలు చేసి పేదలకు భూములను పంపిణీ చేసిన ఘనత మా పార్టీదేనని సీపీఐ రాష్ట్ర నాయకుడు ముత్యాల విశ్వనాథం అన్నారు. మండలంలోని పునుకుల గ్రామంలో సోమవారం జకరయ్య అధ్యక్షతన గ్రామశాఖ మహాసభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అనంతరం గ్రామశాఖ నూతన కమిటీని ఎన్నుకున్నారు. కార్యదర్శిగా మాలోతు శ్రీను, సహాయ కార్యదర్శి బలభద్ర అరవింద్, పునుకలతండా కార్యదర్శిగా లకావత్ శ్రీను, సహాయ కార్యదర్శి సామేలుతోపాటు 21మంది సభ్యులను ఎన్నుకున్నారు. వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, కొంగర అప్పారావు, భూక్యా విజయ్, లాల్‌పాషా పాల్గొన్నారు.

నిరాహార దీక్ష పోస్టర్ల ఆవిష్కరణ

సూపర్‌బజార్(కొత్తగూడెం): సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారం కోసం తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఈనెల 4వ తేదీన సింగరేణి ప్రధాన కార్యాలయం నిరాహార దీక్ష నిర్వహించనున్నారు. ఈ మేరకు సోమవారం బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు, మాజీ ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు, హరిప్రియ నాయక్, మెచ్చా నాగేశ్వరరావు, మాజీ గ్రంథాలయ చైర్మన్ దిండిగాల రాజేందర్ పోస్టర్లను ఆవిష్కరించారు. టీబీజీకేఎస్ రాష్ట్ర చీఫ్ జనరల్ సెక్రటరీ కాపు కృష్ణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి, భద్రాచలం నియోజకవర్గ ఇన్‌చార్జ్ రామకృష్ణ, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ దామోదర్, మండల, పట్టణ అధ్యక్షులు, మాజీ ఎంపీపీలు, మాజీ జెడ్పీటీసీలు, వార్డు కౌన్సిలర్లు, బీఆర్ఎస్, టీబీజీకేఎస్ నాయకులు పాల్గొన్నారు.

100 రోజుల ప్రణాళిక విజయానికి ప్రతిజ్ఞ


మానవహారంలో ప్రతిజ్ఞ చేస్తున్న మున్సిపల్, మెప్మా సిబ్బంది

ఇల్లెందు: మున్సిపల్ శాఖ 'వంద రోజుల ప్రణాళిక విజయానికి ప్రతిజ్ఞ'కార్యక్రమాన్ని సోమవారం ఇల్లెందు మున్సిపాలిటీలో నిర్వహించారు. కమిషనర్ సీహెచ్ శ్రీకాంత్ ఆధ్వర్యంలో మున్సిపల్ సిబ్బంది, మహిళా సంఘాల వారు మున్సిపల్ కార్యాలయం నుంచి ర్యాలీ నిర్వహించారు. కమిషనర్ శ్రీకాంత్ మాట్లాడుతూ... ఈ కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు, తడి పొడి చెత్త వేరు చేయుట, తడి చెత్తతో ఎరువులు తయారీ ప్రధాన ఉద్దేశం అన్నారు. అలాగే మహిళా సంఘాల రుణాలు, కొత్త ఇంటి నంబర్లు, ట్రేడ్ లైసెన్స్‌ల కేటాయింపు, మొక్కలు నాటడం, డ్రెయినేజీల్లో పూడికతీత మొదలైన పనులు ఈ 100 రోజుల ప్రణాళికలో దశల వారీగా ప్రత్యేకంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ అంకుషావలీ, టీఎంసీ నాగయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి భూభారతి సదస్సులు

చుంచుపల్లి: మండలంలో మంగళవారం నుంచి ఈ నెల 18 వరకు భూభారతి రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు చుంచుపల్లి తహసీల్దార్ పి.కృష్ణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

భూములకు సంబంధించిన అన్నిరకాల దరఖాస్తులను స్వీకరిస్తామని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని రైతులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

జూలూరుపాడు: మంగళవారం నుంచి 20వ తేదీ వరకు గ్రామాల్లో భూభారతి రెవెన్యూ సదస్సులు జరగనున్నట్లు తహసీల్దార్ టి.శ్రీనివాస్ తెలిపారు. సోమవారం స్థానిక తహసీల్‌లో విలేకరులతో మాట్లాడారు. మండలంలోని ఎనిమిది రెవెన్యూ గ్రామాల్లో పంచాయతీ కార్యాలయాల్లో నిర్ణయించిన తేదీ ప్రకారం పట్టా భూములు, పాస్ పుస్తకాలు, ఇతర భూ సమస్యలపై రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు చెప్పారు. ఈనెల 3న కొమ్ముగూడెం, నల్లబండబోడు, 4న గాంధీనగర్, కరివారిగూడెం, 5న చింతలతండా, అనంతారం, 6న పడమటనర్సాపురం, శంభునిగూడెం, 9న బేతాళపాడు, కాకర్ల, 10న గుండ్లరేవు, గుండెపుడి, 11న అన్నారుపాడు, సురారం, 12న వెంగన్నపాలెం, భోజ్యాతండా, 13న పాపకొల్లు, సాయిరాం తండా, 17న జూలూరుపాడు, కొత్తూరు, 18న వినోభానగర్, మాచినేనిపేట, 19న గురువాగుతండా, 20న మాచినేనిపేటతండాలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

ఇల్లెందురూరల్: మండలంలోని గ్రామపంచాయతీ కేంద్రంగా మంగళవారం నుంచి రెవెన్యూ గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ కోట రవికుమార్ సోమవారం తెలిపారు. 3న ఇల్లెందు తహసీల్, మామిడిగుండాల, 4న ఇందిరానగర్, బాలాజీనగర్, ధనియాలపాడు, 5న సుదిమళ్ల, లచ్చగూడెం, 6న పూబెల్లి, రేపల్లెవాడ, 9న సుభాష్‌నగర్, చల్లసముద్రం, ఒడ్డుగూడెం, 10న రాఘబోయినగూడెం, సీఎస్పీ బస్తీ, 11న బోయితండా, మాణిక్యారం, కొమ్ముగూడెం, మామిడిగూడెం, 12న కొమరారం, పోచారంతండా, మస్సివాగు, ముత్తారపుకట్ట, 13న పోలారం, మిట్టపల్లి, 16న మర్రిగూడెం, మొండితోగు, 17న రొంపేడు, 18వ తేదీన తిలక్‌నగర్, విజయలక్ష్మీనగర్ గ్రామసభలు కొనసాగుతాయని చెప్పారు.

సత్తా చాటిన బొమ్మనపల్లి విద్యార్థులు


మంత్రి తుమ్మల నుంచి ప్రశంసాపత్రం అందుకుంటున్న హెచ్‌ఎం పద్మ, విద్యార్థులు

టేకులపల్లి: తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకల్లో టేకులపల్లి మండలం బొమ్మనపల్లి విద్యార్థులు సత్తా చాటారు. సోమవారం జిల్లా కేంద్రంలో జరిగిన రాష్ట్ర ఆవతరణ వేడుకల్లో బొమ్మనపల్లి విద్యార్థుల ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, కలెక్టర్ వి.జితేష్ పాటిల్ చేతుల మీదుగా ప్రశంశాపత్రం అందుకున్నారు. స్కౌట్స్ అండ్ గౌడ్స్ విభాగం ఫ్లాక్ లీడర్ జ్యోతిరాణి, హెచ్ఎం పద్మ, నీరజ, శారోన్ పాల్గొన్నారు.

తెలంగాణలో సింగరేణి పాత్ర గణనీయమైనది..

ఇల్లెందు: తెలంగాణ స్వరాష్ట్ర సాధనలో సింగరేణి పాత్ర ఘననీయమైందని, ప్రగతి పథంలో స్వరాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధికి సింగరేణి తోడ్పాటు ఉంటుందని ఏరియా జీఎం వీసం కృష్ణయ్య అన్నారు. జేకే సింగరేణి గ్రౌండ్‌లో సోమవారం జరిగిన వేడుకలో జీఎం మాట్లాడుతూ.. తెలంగాణ సాధన ఉద్యమంలో సింగరేణి కీలక భూమిక పోషించిందన్నారు. అమరుల త్యాగం వృథా కాదన్నారు. తెలంగాణ అన్ని రంగాల్లో ప్రగతి సాధిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓటూ జీఎం రామస్వామి, అధికారుల సంఘం అధ్యక్షుడు శివప్రసాద్, ఏజీఎం(ఇఇ) గిరిధర్‌రావు, డీజీఎం పర్సనల్ జీవీ మోహన్‌రావు, సేవా అధ్యక్షురాలు రమా తదితరులు పాల్గొన్నారు. అనంతరం సింగరేణి స్కూల్ గ్రౌండ్‌లో జెండా ఆవిష్కరించి తెలంగాణ రుచుల స్టాల్స్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కల్చరల్ కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

సమగ్రాభివృద్ధే లక్ష్యంగా 'సంక్షేమం' అమలు


ఇళ్ల పట్టాలు అందజేస్తున్న ఎమ్మెల్యే కనకయ్య, కలెక్టర్ పాటిల్


హాజరైన ఇళ్ల లబ్ధిదారులు, పార్టీ కార్యకర్తలు

ఇల్లెందురూరల్: అభివృద్ధి, సంక్షేమం జోడెడ్లుగా కాంగ్రెస్ ప్రభుత్వం పాలన సాగిస్తోందని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. నియోజకవర్గ పరిధిలో 3,500 మంది ఇందిరమ్మ లబ్ధిదారులకు మండలంలోని బొజ్జాయిగూడెంలో సోమవారం కలెక్టర్ జితేష్ వి.పాటిల్‌తో కలిసి ఇళ్ల పట్టాలు అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఇల్లెందులో వంద పడకల ఆస్పత్రి, ఐటీఐ ఇంటిగ్రేటెడ్ గురుకుల పాఠశాల మంజూరు చేయించడమే కాక పల్లెల్లో రహదారులను అభివృద్ధి చేస్తున్నామన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ... ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుంటూ ప్రతీ కుటుంబం ఆర్థిక ప్రగతి సాధించాలన్నారు. అనంతరం లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు, రైతులకు విత్తనోత్పత్తి వంగడాలను పంపిణీ చేశారు. కాగా, సమావేశం నిర్వహించిన ఫంక్షన్ హాల్‌లో రెండువేలకు మించి పట్టకపోగా ఇళ్ల లబ్ధిదారులు, పార్టీ కార్యకర్తలు, అధికారులతో హాల్ కిటకిటలాడి తోపులాట చోటు చేసుకుంది. ప్రాంగణం లోపల ఎంత మంది ఉన్నారో అంతకు మించి బయట ఉన్నవారు ఎండ వేడిమికి ఇబ్బంది పడ్డారు. బానోత్ రాంబాబు, మేకల మల్లిబాబుయాదవ్, తహసీల్దార్ రవికుమార్, ఎంపీడీఓ ధన్‌సింగ్, ఏడీఏ లాల్‌చంద్ పాల్గొన్నారు.

ప్రమాదకరంగా చల్లసముద్రం పెద్దచెరువు

- ఛిద్రమైన తూము షట్టర్, కట్టకు పగుళ్లు
- నిర్వహణ లేక అధ్వానంగా పంట కాల్వలు
- ఈ ఏడాది పంటల సాగుపై రైతుల్లో ఆందోళన


చల్లసముద్రం పెద్దచెరువు


షట్టర్‌కు అడుగు భాగంలో ఏర్పడిన రంధ్రం

ఇల్లెందురూరల్: మండలంలో పెద్దచెరువులలో ఒకటైన చల్లసముద్రం పెద్దచెరువు ఈ ఏడాది రైతులకు సాగునీటిని అందించే పరిస్థితిలో లేదు. మిషన్ కాకతీయ పథకంలో భాగంగా చేపట్టిన పునరుద్ధరణ పనులు, అంతకు ముందు చేపట్టిన అభివృద్ధి పనులు నాణ్యతా లోపంగా ఉండటంతో చెరువు దుస్థితి మళ్లీ యథాతథ స్థితికి చేరుకుంది. కాల్వలు, షట్టర్లు, తూములు బలహీనంగా మారి రైతులను ఆందోళనకు గురిచేస్తోంది.

నాటి నిర్లక్ష్యమే శాపం...

248 ఎకరాల విస్తీర్ణంలో సుమారు వెయ్యికి పైగా ఎకరాల ఆయకట్టుతో మండలంలోని చల్లసముద్రం పెద్దచెరువు రూపుదిద్దుకుంది. కానీ సరైన నీటి వనరు లేక ప్రతీ ఏటా అన్నదాతలకు అండగా ఉండలేకపోతోంది. చెరువు దుస్థితిని గమనించిన గత ప్రభుత్వం మిషన్ కాకతీయ పథకంలో భాగంగా రూ.2.24కోట్ల వ్యయంతో 2017లో చెరువు పునరుద్ధరణ పనులు చేపట్టింది. అంతకు ముందు రూ.20లక్షల వ్యయంతో చెరవు కట్ట, కాల్వల మరమ్మతు పనులు చేపట్టింది. కానీ నాటి పనులు నాణ్యతా లోపంగా ఉన్నాయని స్థానికుల నుంచి విమర్శలు వచ్చినా ఎవరూ పట్టించుకోకపోవడంతో చెరువు పూర్వస్థితికి చేరుకుంది.

ఆందోళనకరంగా నీటి వనరు..

విస్తీర్ణం, పేరులో పెద్దగా ఉన్న చల్లసముద్రం... నీటివనరు విషయంలో చిన్నకుంటను తలపిస్తోంది. చెరువుకు నీటి వనరు సమకూర్చాలని దశాబ్దాలుగా ఆయకట్టు రైతులు వివిధ రూపాల్లో ఆందోళనలు చేపట్టినా ఫలితం లేకుండా పోయింది. గత ప్రభుత్వ హయాంలో సీతారామ ప్రాజెక్టు నుంచి గోదావరి నీటిని మళ్లించేందుకు ప్రయత్నాలు చేసినట్లు కనిపించినా నేటికీ ఆచరణ రూపం దాల్చలేదు. కొంతకాలంగా రూపొందించబడిన ప్రతిపాదనలు కాగితాలకే పరిమితమయ్యాయి. ఫలితంగా గతంమాదిరిగా లచ్చగూడెం ఎర్రచెరువు అలుగు నీరు, సమీపంలోని అడవులలో కురిసిన వర్షపు నీటితో చల్లసముద్రం పెద్దచెరువు తన ఆయకట్టు రైతులను ఆదుకుంటోంది.

ప్రతిపాదనకే పరిమితమైన మరమ్మతులు..

చల్లసముద్రం పెద్దచెరువు కట్టతోపాటు తూములు శిథిలావస్థకు చేరుకున్నాయి. కాల్వలకు అడుగడుగునా గండ్లు పడ్డాయి.

కాల్వల్లో పిచ్చిమొక్కలు పెరిగాయి. ఈ పరిస్థితిని గుర్తించిన ఇరిగేషన్ అధికారులు చెరువు, కాలువల అభివృద్ధికి రూ.1.20 కోట్ల వ్యయంతో ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపారు. రెండేళ్లు గడుస్తున్నా ఆ ఫైల్ జాడ లేదు. కనీసం స్పందన కూడా లేకపోవడం విచారకరం.

అధ్వానంగా కాల్వలు, తూము షట్టర్లు

చెరువు పునరుద్ధరణ పనులు జరిగిన నాటి నుంచి పనులపై స్థానిక రైతులు అసంతృప్తి వ్యక్తం చేస్తూ వచ్చారు. కట్ట బలహీనంగా మారిందని, తూములకు షట్టర్లు సరిగా బిగించలేదని, కాల్వలకు సిమెంటు లైనింగ్ చేయలేదని పలు సందర్భాలలో వాపోయారు. కానీ పాలకులు వారి ఆవేదనను విస్మరించడంతో చెరువు పరిస్థితి మళ్లీ యథాస్థితికి చేరుకుంది. పంట కాల్వలు పూర్తిగా ఛిద్రమయ్యాయి. కనీసం సాగునీరు ప్రవహించే పరిస్థితి లేకుండా పోయింది. తూము షట్టర్లు మరింతగా ఛిద్రమయ్యాయి. ఈ క్రమంలో చెరువులోకి వచ్చే నీరు నేరుగా కాల్వల్లోకి చేరేలా ఉన్నాయి. కనీసం షట్టర్లనైనా ఇప్పటికిప్పుడు మరమ్మతు చేయకపోతే చెరువులోకి ఎంత నీరు వచ్చినా బయటికే వెళ్లే పరిస్థితి నెలకొంది.

అధికారులు తక్షణం స్పందించాలి



నిర్వహణ సరిగా లేక చల్లసముద్రం పెద్దచెరువు పూర్తిగా ఛిద్రమైంది. చెరువు కాల్వలు, కట్ట అధ్వాన స్థితికి చేరుకున్నాయి. పూర్తిగా ఛిద్రమైన షట్టర్ల నుంచి వరదనీరు కాలువలలోకి నేరుగా తరలిపోతున్నాయి. ఇరిగేషన్ శాఖ అధికారులు తక్షణం స్పందించి చెరువుకు మరమ్మతులు చేయించాలి.

– ధనియాకుల బాబు, రైతు, చల్లసముద్రం

ప్రతిపాదనలు సిద్ధం చేశాం..



పెద్దచెరువు పూర్తిస్థాయి మరమ్మత్తుల కోసం రూ.1.20 కోట్ల వ్యయంతో ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపాం. ప్రస్తుతం చెరువు షట్టర్లు, కాలువలు అధ్వానంగా ఉన్నాయి. తక్షణ మరమ్మతుల కోసం రూ.20లక్షల వ్యయంతో ప్రతిపాదనం పంపాం. అనుమతులు రాగానే పనులు ప్రారంభిస్తాం.

– భాగ్యరాజ్, డీఈ, ఇరిగేషన్ శాఖ, ఇల్లెందు

ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించండి..


ఇల్లెందు: మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

ఇల్లెందు: తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.వెంకటేశ్వర్లు కోరారు. ఈ మేరకు సోమవారం ఇల్లెందులో యూటీఎఫ్ ప్రచార జాతా నిర్వహించింది. అన్ని సదుపాయాలు కలిగిన ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి నాణ్యమైన విద్యను పొందాలని కోరారు. ఉచిత భోజనం, పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్, యూనిఫాం, ఫీజులు లేని పాఠశాలలు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో బి.రాజు, వరలక్ష్మి, హతీరాం, జయరాజు, ఏ.రాంబాబు, వెంకటేశ్వర్లు, పి.జయరాజు, శ్రీను, శేషగిరి, రాజమణి తదితరులు పాల్గొన్నారు.

టేకులపల్లి: మన పిల్లలను మన ఊరి బడిలో చేర్పించాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు వి.వరలక్ష్మి కోరారు. సోమవారం టేకులపల్లి మండలంలో టీఎస్ యూటీఎఫ్ యాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బి.రాజు, వెంకటేశ్వర్లు, మాన్సింగ్, హరి, రాంచందర్ పాల్గొన్నారు.

చెక్‌పోస్టు తనిఖీ


రికార్డులు పరిశీలిస్తున్న డీఎస్పీ చంద్రభాను

ఇల్లెందురూరల్: మండలంలోని సుభాష్‌నగర్ గ్రామ పంచాయతీ లలితాపురం గ్రామంలోని ఖమ్మం – భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల సరిహద్దు చెక్‌పోస్టును డీఎస్పీ చంద్రభాను సోమవారం తనిఖీ చేశారు. చెక్‌పోస్టు వద్ద వాహన తనిఖీలో భాగంగా సిబ్బంది తీసుకుంటున్న జాగ్రత్తలపై ఆరా తీశారు. రోజువారీగా తనిఖీ చేస్తున్న వాహనాల వివరాలను రికార్డుల ఆధారంగా పరిశీలించారు. సీఐ సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.